ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

3

శుక్రవారం 10 జనవరి 2025





బంగారు దక్షిణావృత శంఖు



విద్యుద్దీపాలంకరణలో ఉత్తర గాలిగోపురం

రుణాల.. మాఫీయా



డీసీసీబీని కొల్లగొట్టిన భోక్తలు

- 17 సహకార సంఘాల్లో అక్రమాలు
- రూ.220 కోట్లు మింగేసిన అక్రమార్కులు
- ప్రత్తిపాడు పరిధిలో 11 మంది రైతుల అరెస్టు
- 21 మంది మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లకు కష్టకాలం

గుంటూరు సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం.. వారి సేవలో ఉండాల్సిన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(జీడీసీసీబీ)ను అక్రమార్కులు కొల్లగొట్టేశారు. అక్రమార్కులు మాఫియాగా మారి నకిలీ రైతుల పేరుతో రూ.కోట్లలో రుణాలను పొందగా.. వారికి అధికారులు సహకరించారు. గతంలోనూ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన రుణమాఫీ పథకంలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నాయి. గత ఐదేళ్ల యథేచ్ఛగా చెలరేగిన అక్రమార్కులకు కష్టకాలం మొదలైంది. విభజిత గుంటూరు జిల్లాలోనే డీసీసీ బ్యాంకుకు చెందిన సుమారు రూ.220 కోట్లు కొందరు నేతలు, ఉద్యోగులు, నకిలీ రైతుల పేర్లతో పక్కదారి పట్టించిన విషయం విదితమే. జిల్లాలోని 17 సహకార సంఘాల్లో అక్రమాలు చోటుచేసు కోగా 184 మంది రైతులు, 21 మంది డీసీసీబీ మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు ఉన్నట్లు సహకార శాఖ తేల్చింది. ప్రత్తిపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన 11 మంది నకిలీ రైతులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పాసు పుస్త కాలు, ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు సృష్టించి రూ.5 కోట్ల వరకు కొల్లగొట్టి నట్లు పోలీసులు తేల్చారు. డీసీసీబీ అక్రమాలపై 18 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. క్షేత్రస్థాయిలో కనీస పరిశీలన లేకుండానే రుణాలు మంజూరుతో అక్రమాలకు తెరలేచింది. డీసీసీబీ పాలకవర్గంలో కీలక పాత్ర పోషించిన నేతలు, సీఈవో, మేనేజర్లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కార్యదర్శులు, తహసీల్దార్లు, వీఆర్వోలు ఈ అక్రమాల్లో భాగస్వాములుగా ఉన్నారని

(మిగతా 6వ పేజీలో)

డీసీసీబీ అక్రమాలపై సెక్షన్ 51 విచారణ

గుంటూరు సిటీ: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అక్రమాలపై సెక్షన్ 51 విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా అదనపు రిజిస్ట్రార్ ఎన్‌వీఆర్ ఆనందబాబును నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ బాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. బ్యాంకు వ్యవహారాలపై ఫిర్యాదులు, నిధులు దుర్వినియోగం, రుణాల మంజూరులో మోసపూరిత కార్యకలాపాలపై విచారణకు ఆదేశించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శ్రీహరినాయుడి అనే వ్యక్తి ఫిర్యాదులతో విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. శ్రీహరినాయుడు పేర్కొన్న ఆరోపణలు చాలావరకు నిజమని తేలిందని వెల్లడించారు. అక్రమాలను దాచడంలో సీఈవో పాత్రపై కూడా ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. అక్రమాలపై 2023 మార్చి 31న నాబార్డు అధికారుల నివేదికలో పేర్కొన్న అంశాలను కూడా ఈ ఉత్తర్వుల్లో ఉటంకించారు.

నకిలీ పాస్ పుస్తకాలతో..
రూ.5 కోట్లు స్వాహా

- నిందితుల్లో విశ్రాంత తహసీల్దారు, బ్యాంకు మేనేజర్

గుంటూరు: గతంలో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో చోటుచేసుకున్న అక్రమాలపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి రూ.5 కోట్ల రుణాలు స్వాహా చేసిన ఘటనపై గత ఏడాది సెప్టెంబరు 18న ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేయగా గురువారం 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో డీసీసీబీ ప్రత్తిపాడు బ్రాంచ్ మేనేజర్ బొల్లినేడి రవికుమార్, గతంలో చిలకలూరిపేట మండలం కావూరు సొసైటీ కార్యదర్శిగా పనిచేసిన సోమేపల్లి నాగరాజు, వినుకొండలోని ఓ డిగ్రీ కళాశాల పీఆర్వో బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన తిరువీధి యోగయ్య, శావల్యాపురం మండలం కనమర్లపూడికి చెందిన ముంద్రు సీతారామాంజనేయులు అలియాస్ ఆంజనేయులు, వినుకొండలోని

(మిగతా 6వ పేజీలో)

నేడు మంగళగిరి నృసింహుని ఉత్తర ద్వార దర్శనం

- దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థప్రసాదాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

6లో

రైతు సంక్షేమానికి, కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం

- సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు

4

వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి

నేడు గుంటూరుకు చంద్రబాబు



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

- సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం గుంటూరుకు రానున్నారు. స్థానిక స్తంభాలగరువులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో మూడు రోజులు జరిగే నరెడ్కో ప్రాపర్టీ షో శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్పీ సతీష్‌కుమార్, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, ఏఎస్పీ సుప్రజ, వెస్ట్ డీఎస్పీ మెహర్‌జయరాం ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథరెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌డీ నాగమల్లేశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృత, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, నగేష్ , నరెడ్కో ప్రాపర్టీ షో చైర్మన్ గద్దె తిరుపతిరావు, ప్రెసిడెంట్ నాగవంశి తదితరులు పాల్గొన్నారు.



దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రగామిగా
సంగం డెయిరీ



సంగం డెయిరీ చైర్మన్ నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షుడు రూపేంద్ర సింగ్ సోఢీ

పొన్నూరుటౌన్, జనవరి 9: దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రగామిగా సంగం డెయిరీ నిలుస్తోందని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రూపేంద్ర సింగ్ సోఢీ అన్నారు. బెంగళూరులో ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ సదరన్ సమ్మిట్ గురువారం జరిగింది. ప్రాంతీయ డెయిరీ కాన్ఫరెన్స్ ఈవెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల నుంచి సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎండీ పి.గోపాలకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేంద్రకుమార్, ఎండీని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఇండియన్ డెయిరీ అసోసియేషన్ కార్యక్రమాలకు సంగం డెయిరీ మద్దతు ఇస్తుందన్నారు. డెయిరీరంగంలో తాజా పరిణామాలు తెలుసుకోవడానికి ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందన్నారు. దక్షిణాది ప్రాంతంలో డెయిరీ రంగం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, దక్షిణాది రాష్ట్రాల ప్రముఖ డెయిరీల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

12న 'కౌండిన్య' ట్రస్ట్
ఉపకార వేతనాల ప్రదానోత్సవం

గుంటూరు మెడికల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 19వ ఉపకార వేతన ప్రదానోత్సవం ఈ నెల 12న పెదకాకాని మండలం వెనిగండ్ల శివార్లలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవన్‌లో జరుగుతుందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 10వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు చదువుతున్న ప్రతిభ గల 555 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు రూ.22 లక్షల ఉపకార వేతనం అందిస్తున్నట్లు డాక్టర్ నారాయణ తెలిపారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడు వేల మంది విద్యార్థులకు రూ.2.10 కోట్ల ఉపకార వేతనం అందించినట్లు ఆయన చెప్పారు. ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీతో పాటు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ తరఫున అన్ని పోటీ పరీక్షలకు అతి తక్కువ ఫీజుతో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. 12వ తేదీన జరిగే ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ అమర్నాథ్ గౌడ్ హాజరౌతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నారాయణ, డాక్టర్ సేవకుమార్

రైతు సంక్షేమానికి, కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం

● సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు



నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ పులుకూరి కాంతారావు తదితరులు

సత్తెనపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కాలువల అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. గురువారం స్థానిక ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో ప్రాజెక్టు కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశం పలుకూరి అధ్యక్షతన నిర్వహించారు. చివరి భూముల వరకు నీరు అందేలా చూడాలని, అమరావతి మేజరు కాలువ కింద భూములకు నీరు సక్రమంగా అందటం లేదని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు బీ వెంకటేశ్వరరావు, వడ్లమూడి అప్పారావులు చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. పలు కాలువ కట్టల పై పిచ్చి చెట్లు మొలచి ఉన్నాయని, వాటిని తొలగించాలని, కాలువ కట్టలను బలోపేతం చేయాలని కోరారు. మరో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పులిమి రామిరెడ్డి మాట్లాడుతూ కాలువల అభివృద్ధి పనులను డీసీలకు అప్పగించాలని కోరారు. బండారుపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మధుసూదనరావు మాట్లాడుతూ తమ ప్రాంతంలో కాలువల పై ఎన్ఎస్‌పీ అధికారులు పర్యటించటం లేదని, కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని కాలువల్లో పూడిక తీత పనులు చేయించాలని, ఖాళీగా ఉన్న ఎన్‌ఎస్‌పీ లస్కర్ పోస్టులను భర్తీ చేయాలని 22వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మన్నవ శ్రీనివాస్ కోరారు. డీసీ చైర్మన్‌లు ప్రస్తావించిన సమస్యలపై పలుకూరి మాట్లాడుతూ నాగార్జున కాలువ పరిధిలోని చివరి భూముల వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.

సమావేశంలో జిల్లాల వారీగా, డివిజన్‌ల వారీగా వివరాలను అధికారులు అందించారు. డివిజన్‌ల వారీగా కాలువలపై జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సమావేశంలో చర్చించారు. 2025 - 26 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువను సక్రమంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్‌లోని నీటి లభ్యతను బట్టి అనుసరించాల్సిన నీటి నియంత్రణ పద్ధతులు వారాబంది అమలు ఆవశ్యకతపై చర్చించారు. పొరుగు సేవల పద్ధతిలో లస్కర్ల నియామకం, తూముల వద్ద గ్రిల్స్ ఏర్పాటు, జిల్లా సరిహద్దులోని నీటి నియంత్రణ ప్రణాళిక గురించి చర్చించారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాటి, గోగినేని కోటేశ్వరరావు, పసుపులేటి పాపిరెడ్డి, ఎన్‌ఎస్‌పీ ఈఈ మురళీధర్, ఒంగోలు ఎస్ఈ రామకృష్ణ, వినుకొండ ఈఈ ప్రేమ్ కుమార్, లింగంగుంట్ల సెక్షన్ ఈఈ సుబ్బారావు, పలు ఎన్‌ఎస్‌పీ సబ్ డివిజన్‌ల ఏఈలు పాల్గొన్నారు.

కుప్పడం చీరలకు జాతీయ స్థాయి ప్రత్యేకత

● కలెక్టర్ జె.వెంకటమురళి



కుప్పడం చీరలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కేంద్రబృందం

బాపట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద ఎంపికైన కుప్పడం చీరలకు జాతీయ స్థాయిలో ప్రత్యేకత ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద చీరాల కుప్పడం చీరలు ఎంపికైన నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన కోసం కేంద్ర బృందం సభ్యులు ఇష్‌దీప్, డాక్టర్ దివ్య గురువారం బాపట్ల చేరుకున్నారు. కేంద్ర బృందం సభ్యులను కలెక్టర్ జె.వెంకటమురళి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కుప్పడం చీరల ప్రదర్శనను కేంద్రబృందం సభ్యులు, కలెక్టర్ కలిసి పరిశీలించారు. అనంతరం పీపీటీ ద్వారా చీరాలలో చేనేత వస్త్రాల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై చేనేత జౌళి శాఖాధికారులు కేంద్ర బృందానికి నివేదిక అందజేశారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో చీరాల, పేరాల ఉద్యమ ప్రాశస్త్యాన్ని కేంద్రబృందం సభ్యులకు అధికారులు వివరించారు. మినీబొంబాయిగా ప్రాచుర్యం పొందిన చీరాల ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. విదేశీ వస్త్రాలను వ్యతిరేకించాలని మహాత్మాగాంధీజీ ఇచ్చిన పిలుపు అందుకున్న చీరాల, పేరాల చేనేత కార్మికులు ఉద్యమంలో ప్రధానపాత్ర పోషించారని వివరించారు. నేత వస్త్రాల ఉత్పత్తులకు చీరాల క్షీరపురిగా మారిందన్నారు. 16,368 మంది చేనేత కార్మికులు మగ్గాలను ఆధారం చేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చేనేత సహకార సంఘాలలో 7,850 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారని వివరించారు. ఒకజిల్లా ఒక ఉత్పత్తి కింద చీరాల కుప్పడం చీరలను ఎంపిక చేసి అధికారికంగా ప్రకటిస్తే చేనేత కార్మికులను మరింత ఆదుకున్నట్లు అవుతుందన్నారు. చేనేత కార్మికులకు కేంద్రం నుంచి రాయితీలు, బహుళ ప్రయోజనాలు కల్పించేలా సహకరించాలని కలెక్టర్ కోరారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వనజ మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకోవటానికి రాష్ట్రప్రభుత్వం సాధ్యమైనంత వరకు కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సంయుక్త సంచాలకులు కె.కన్నబాబు, జిల్లా సహాయ సంచాలకులు కె.నాగమల్లేశ్వరరావు, డీవోలు వెంకటేశ్వర్లు, చేనేతలు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

చిలకలూరిపేటలో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం

చిలకలూరిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో పేరెన్నికగన్న రామ్‌రాజ్ కాటన్ షోరూం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని గుండయ్యతోటలో ఏర్పాటైంది. గురువారం చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈ షోరూంను లాంఛనంగా ప్రారంభించగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంయుక్త కార్యదర్శి షైలవరపు కృష్ణతేజ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సీఏ పెనుగొండ సుబ్బారాయుడు జ్యోతిప్రజ్వలన చేయగా, చిలకలూరిపేట విద్యాసంఘం కార్యదర్శి షైలవరపు వీఎస్ శివానందకుమార్ తొలి విక్రయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భారతదేశ అత్యంత విశ్వసనీయ, అత్యంత ఆకర్షణీయమైన బ్రాండ్ జాబితాలో రామ్‌రాజ్ స్థానం పొందడం హర్షణీయమని పేర్కొన్నారు. ధోతీలు, చొక్కాలు వంటి తెల్లదుస్తుల విక్రయాల్లో తమ సంస్థ గణనీయమైన ముందడుగు వేసిందని వివరించారు.



రామ్‌రాజ్ కాటన్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

69,119 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 70,712 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 69,119 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,442 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14500	334	7400	14000
నంబరు. 5	8500	14500	నంబరు. 5	8800	8800
273	9000	12000	273	9000	11000
341	8000	15000	341	8500	13200
4884	11000	11000	4884	–	–
సూపర్ 10	–	–	సూపర్ 10	11000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7300	16000	తేజ	7500	15500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	7500	12500
దేవనూరుడీలక్స్	9000	14500	దేవనూరుడీలక్స్	–	–
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	10000

నేటి నుంచి నరెడ్కో మెగా ప్రాపర్టీషో - 2025

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నరెడ్కో కాపిటల్ జోన్, గుంటూరు నిర్వహించబోయే 12వ మెగా ప్రాపర్టీషో ఈ నెల 10, 11, 12 తేదీలలో చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు గురువారం వెల్లడించారు. ఈ మేరకు ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నట్లు వివరించారు. ప్రాపర్టీ షోలో మంత్రి నారాయణ, లోకల్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు కూడా అతిథులుగా పాల్గొననున్నారు. జనవరి 12న ప్రాపర్టీషో ముగింపు కార్యక్రమం జరగనుందన్నారు. నరెడ్కో చైర్మన్ హీరానందని, నేషనల్ ప్రెసిడెంట్ గడ్డిపాటి హరిబాబు, స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాపర్టీషోలో 150 స్టాల్స్ ఏర్పాటుచేశామని, వీటిలో బిల్డర్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ నాగవంశీ, సెక్రెటరీ శ్రీనాథ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి విషాదంపై క్షుద్ర రాజకీయాలు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట విషాదంపై కనీస మానవత్వం లేకుండా జగన్ క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. తిరుమల ఘటనలో ప్రభుత్వ వైఫల్యం, ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యుడంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం జీవీ ఆంజనేయులు గురువారం తీవ్రంగా స్పందించారు. తిరుపతిలో జరిగిన దుర్ఘటన ముమ్మాటికీ అందర్నీ కలచివేసిందన్నారు. ప్రభుత్వం కూడా అంతే వేగంగా స్పందించి చర్యలు చేపట్టిన విషయాన్ని విస్మరించడం జగన్ నైజాన్ని బయట పెడుతోందన్నారు. జగన్ అంటేనే శవ రాజకీయాలకు చిరునామా అని, శవం కనిపిస్తే రాబందులా వాలిపోవడం ఒకటే జగన్‌కి తెలిసిన రాజకీయం అని ప్రస్తుత పరిణామాలతో మరోసారి నిరూపితం అవుతోందన్నారు. తిరుపతి ఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తిరుపతికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారని, తప్పు అధికారుల స్థాయిలో జరిగింది కాబట్టే వారిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. జగన్, వైసీపీ నేతల స్పందనలో ప్రభుత్వంపై బురదజల్లాలన్న వారి ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు బాధ్యతతోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ బాధితుల్ని పరామర్శించారని, రూ.25లక్షల పరిహారం ప్రకటించారని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

తిరుమల ఘటన బాధాకరం : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం విచారం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే అధికారులు స్పందించి గాయపడ్డ వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారన్నారు. జరిగిన మొత్తం ఘటనలో ఏదో కుట్రకోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి

యడ్లపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విచారణకు వెళ్లిన వక్ఫ్ బోర్డు అధికారిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపాలెం గ్రామ పరిధిలోని హజరత్ బురావృద్దీన్ దర్గాకు 87.20 ఎకరాల భూమి ఉంది. సదరు భూమిని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించి రైతులకు కౌలుకు ఇస్తుంటారు. అయితే గత మూడేళ్లుగా కౌలుదారులు ఎవరూ కౌలు చెల్లించడం లేదు. దీంతో వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆదేశాలతో 87.20 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములకు ఇటీవల బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో షేక్ హుస్సేన్ అనే వ్యక్తి భూములను దక్కించుకున్నాడు. గతంలోని కౌలుదారుల్లో కొందరు కౌలు రద్దు చేయాలని వక్ఫ్ బోర్డు అధికారులపై రాజకీయపరమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో చైర్మన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు ఆడిట్ ఇన్‌స్పెక్టర్‌ను భూమికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం పొలం వద్దకు వచ్చిన ఇన్‌స్పెక్టర్ పొలంలోని పంటలను, అందులోని నిర్మాణాలను ఫొటోలు తీస్తుండగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కాకర్లపూడి మాధవరావు మరో ఐదుగురితో కలిసి అక్కడకు వచ్చి ఫొటోలు ఎందుకు తీస్తున్నావు అంటూ ప్రశ్నించాడు. తాను ముజావర్ల నుంచి 5 ఎకరాలు కొనుగోలు చేశానని, ఈ భూమి తనదనీ, ఎందుకు ఫొటోలు తీస్తున్నావు అంటూ అసభ్యంగా తిడుతూ దాడికి పాల్పడ్డారు. సెల్‌ఫోన్ లాక్కుని పగలగొట్టడమే కాకుండా భూమి వైపు వస్తే చంపేస్తామంటూ కర్రలతో వెంటపడ్డారు. జరిగిన విషయాన్ని వక్ఫ్ బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ యడ్లపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 566.00 అడుగులు ఉంది. ఇది 246.53 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 20,137 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,137 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఇన్‌చార్జి తహసీల్దారుగా శ్రీనివాసరావు

క్రోసూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును ఇన్‌చార్జి తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుని కార్యాలయ సిబ్బంది అభినందించారు.



● మండల కేంద్రమైన దుర్గిలోని పరిశుద్ధాత్మ గాస్పల్ చర్చి ఆవరణలో ఫిబ్రవరి 26న బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శంకర్, పూర్ణ గురువారం తెలిపారు. మత్తయి సువార్తపై ఈ క్విజ్ ఉంటుందని, మండలానికి చెందిన వారు మాత్రమే పాల్గొనాలన్నారు. వివరాలకు సెల్: 6362218163, 9030343195 లను సంప్రదించాలన్నారు.

● మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 2న నిర్వహంచనున్న కానుకమాత తిరునాళ్లను పురస్కరించుకుని ఈనెల 28 నుంచి రాష్ట్ర స్థాయి ఎడ్లపోటీలను నిర్వహించనున్నారు. గురువారం రైతు సంఘ నేతలు పోటీలు నిర్వహించే మైదానాన్ని పరిశీలించారు.

వైసీపీ కార్యకర్త రమేష్ అరెస్ట్

● గురజాల సబ్‌జైల్‌కు తరలింపు

మాచర్లటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వైసీపీ కార్యకర్త సింగంశెట్టి రమేష్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు విలేకరులకు తెలిపారు. ఎన్నికల పోలింగ్ రోజున పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై దాడి చేసిన ఘటనలో ఏ 13 నిందితుడిగా ఉన్న రమేష్ ఎన్నికల తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయారన్నారు. ప్రకాశంజిల్లా యర్రగొండపాలెంలో ఉండగా రమేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రమేష్‌ని హాజరుపర్చగా జడ్జి శ్రీనివాసకళ్యాణ్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. దీంతో రమేష్‌ను గురజాల సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ. 17,37,135

దుర్గి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం హుండీ నగదుని గురువారం లెక్కించగా రూ.17,37,135 ఆదాయం సమకూరిన్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ పీ. సైదమ్మబాయి తెలిపారు. పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ ఈవో సీహెచ్ శివనాగిరెడ్డి పర్యవేక్షించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

గురజాలటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెగుంతలో రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం టీడీపీ నేతలు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జాస్తి ప్రకాష్, వెంకట్రామయ్య, సైదావలి, వీరాస్వామి, పూర్ణయ్య, సత్యం, వెంకటేశ్వర్లు, రామయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

మాచవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి నిధులతో మండలంలోని మోర్జంపాడు హైస్కూల్లో భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థానిక టీడీపీ నేతలు గురువారం శంకుస్థాపన చేశారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచనల మేరకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సుమారు రూ.కోటి నిధులతో తరగతి గదులను నిర్మిస్తున్నట్లు రైతు సంఘం ఉపాధ్యక్షుడు దున్నా చెన్నయ్య చౌదరి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు గడిపూడి సైదయ్య, పోలిశెట్టిపాపయ్య, చండాల శివ, సాధినేని నరేంద్ర, నీలం శ్రీనివాసరావు, బీ వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు

బెల్లంకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సురక్షా మాతృత్వం అభియాన్ పథకంలో భాగంగా ప్రతి నెల 9, 10 తేదీల్లో గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యుడు కోటేశ్వరరావు తెలిపారు. గురువారం చంద్రాజుపాలెం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మణికుమారి, హెచ్‌వీ బేగం, సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, టీడీపీ నేత ఓర్సు ఆనంద్ పాల్గొన్నారు.

అనుమానుస్పద స్థితిలో యువకుడి మృతి

గురజాల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అనుమానుస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మాడుగుల గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై గురజాల సీఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. దాచేపల్లి మండలం ఇరికేపల్లికి చెందిన ఆవుల కొండ (35) వరిపొలాల్లో ఎలుకలకు బుట్టలు పెడుతూ జీవనం సాగిస్తున్నాడు ఈనెల 7న ఇంట్లో నుంచి వరి పొలాల్లో బుట్టలు పెట్టడానికి వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వచ్చిన కొండ మాడుగుల శివారు వరిపొలాల్లో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలు వున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురజాల సీఐ ఆవుల భాస్కర్ తెలిపారు.

పదవుల పందారంపై కసరత్తు

ఇటీవలే సాగునీటి సహకార సంఘాల ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మార్కెట్‌యార్డు పాలక మండలి ఛైర్మన్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రి సభ్య కమిటీల ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మార్కెట్‌యార్డు ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్‌లు ఖరారు చేసింది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఓటర్ల జాబితాలు సిద్ధంగా లేక పోవటం, ఇతర సాంకేతిక సమస్యలుండటంతో ప్రస్తుతానికి ఎన్నికల జోలికి వెళ్ళకుండా త్రిసభ్య కమిటీ లను నియమిస్తామని ప్రకటించింది. ఈ పదవులపై ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు.

- ఇన్‌చార్జుల పాలనలోనే మార్కెట్ యార్డులు
- ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు
- వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీ ఏర్పాటుకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఆయా పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు
- ఇప్పటికే నేతలతో ఎమ్మెల్యే ప్రవీణ్ చర్చలు




క్రోసూరు మార్కెట్ యార్డు , 75 తాళ్ళూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనం

పెదకూరపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) :

పెదకూరపాడు నియోజక వర్గంలో ఏకైక మార్కెట్ యార్డు క్రోసూరు యార్డు. ఈ యార్డు కమిటీ ఛైర్మన్ పదవి ఓసీ మహిళకు రిజర్వేషన్ అయింది. ఛైర్మన్ వైస్ ఛైర్మన్‌తో సహా 19 మంది వరకు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరిలో ఎమ్మెల్యే గౌరవ అధ్యక్షుడిగానూ ముగ్గురు అధికారులను సభ్యులుగానూ నియమిస్తారు. ఛైర్మన్, సభ్యుల నియామకం మొత్తం రిజర్వేషన్ ప్రాతిపదికనే చేపట్టనున్నారు. ఇప్పటికే వీటిపై ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టి సారించారు. ఎవరెవరికి ఏయే పదవులు ఇవ్వాలో నియోజక వర్గ, మండల నేతలతో చర్చలు సాగుతున్నాయి.

నియోజకవర్గంలోని పెదకూరపాడు మండలంలోని 75తాళ్ళూరులో పరస తాళ్ళూరు వ్యవసాయ పరపతి సంఘం ఉంది. అచ్చంపేట మండలంలో వేల్పూరు, అచ్చంపేట, పెదపాలెం బెల్లంకొండ మండలంలో నందిరాజుపాలెం వ్యవసాయ సహకార సంఘం, క్రోసూరులో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ పరపతి సంఘాలకు ఒక్కో సంఘానికి నామినేటెడ్ విధానంలో ముగ్గురు సభ్యులతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేస్తారు. వీరిలో ఒకరు ఛైర్మన్‌గా, మిగిలిన ఇద్దరు సభ్యులుగా ఉంటారు. ఛైర్మన్‌గా ఎవరిని నియమించాలనే అంశాలపై వివిధ మండలాల నేతలతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీతో పాటు కూటమి విజయానికి కృషిచేసిన నేతలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వం చూస్తోన్నట్లు సమాచారం.

గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యం ..

వైసీపీ పాలనలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, మార్కెట్ కమిటీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఐదు సంవత్సరాలుగా వారి పార్టీ కార్యకర్తలతోనే నడిపించేశారు. సహకార సంఘాలను నిర్వీర్యం చేసి ఎరువులు, విత్తనాలు, వ్యాపారం తదితరాలను రైతు భరోసా కేంద్రాలతోనే నిర్వహించారు. దీంతో చాలా సహకార సంఘాల ఉనికే లేకుండా పోయింది. మార్కెట్ యార్డు కమిటీల నుంచి లింకు రోడ్ల నిర్మాణాలు చేపట్టవచ్చు. రైతులతో పాటు పశువులకు వైద్యశిబిరాలు, రైతుబంధు లాంటి పథకాలను అమలు చేయవచ్చు. వీటన్నింటిని గత పాలకులు విస్మరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆయా సంఘాలను పునర్జీవింపచేయడానికి కృషి చేస్తోంది. దీంతో ఎక్కువ మంది ఆయా కమిటీల్లో పదవులపై ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి, సహకార సంఘాల త్రిసభ్య కమిటీ సభ్యుల పదవులు ఎవరిని వరించనున్నాయోనని నియోజక వర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



మట్టపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

దాచేపల్లి,జనవరి9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశితో అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుండటంతో భారీ ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు వైష్ణవ దేవాలయాల్లో దేవతా మూర్తులను భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకోనున్నారు. అదేవిధంగా దక్షణావృతం శంఖంతో భక్తులకు తీర్థం అందజేయనున్నారు. ఇప్పటికే ఆలయాలకు రంగులువేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారికి ఇష్టమైన పవిత్ర తులసి మాలలు సిద్ధం చేశారు. 15 రోజులుగా ఆలయాలలో ధనుర్మాసంతో నగర సంకీర్తన కార్యక్రమం, తిరుప్పావై పఠనం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గురు వారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయా గ్రామ దేవాలయాల్లో పూజా కార్య క్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయం, మాచవరంలోని సీతారామాంజనేయస్వామి వారి ఆయాల్లో, పిల్లుట్ల, మల్లవోలు, పిన్నెల్లి తదితర గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాచవరం సీతారామాంజనేయస్వామి ఆలయంలో స్వామి వార్లను నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు హారతులిచ్చి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి క్రికెట్ లీగ్ ప్రారంభం

● హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం నియోజక వర్గస్థాయి సత్తెనపల్లి క్రికెట్ లీగ్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులకు అన్నిరకాల ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, ఎంపీ చలపతిరావు, వక్కంటి అజయ్, దరువూరి నాగేశ్వరరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్టా శంకరరావు పాల్గొన్నారు.

తిరుపతి ఘటన దిగ్భ్రాంతికరం

తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టిక్కెట్ కౌంటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతకరమని ఎమ్మెల్యే కన్నా అన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కన్నా తెలిపారు.

తుదిదశకు త్రీఫేజ్ విద్యుత్తు పనులు

● ఏపీసీపీడీసీఎల్ ఈఈ సింగయ్య వెల్లడి

రెంటచింతల, జనవరి9(ఆంధ్రజ్యోతి): ఆర్డీ ఎస్ఎస్ (రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టం) కింద మండలంలోని పాలువాయి గ్రామంలో జరుగుతున్న త్రీఫేజ్ విద్యుత్ పనులు తుది దశకు చేరుకున్నాయని ఈఈ ఎన్.సింగయ్య తెలిపారు. గురువారం ఆయన ఆయా పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని పల్లెలకు విస్తరిస్తున్నామని, దీనివలన గ్రామాల్లో విద్యుత్ ను నిరంతరంగా సరఫరా చేయడానికి వీలవుతుందన్నారు.వ్వవసాయానికి ఇస్తున్న తొమ్మిది గంటల సమయంలో మినహాయిస్తే మిగిలిన వేళల్లో సింగిల్ ఫేజ్ సరఫరా అవుతుంది. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లోని గృహ,వ్యవసాయ,పరిశ్రమలు ఇలా అన్ని కేటగిరీలకు త్రీఫేజ్ సౌకర్యం అందుబాటులోకి వస్తే 24 గంటలు విద్యుత్‌ను అందించే అవకాశం ఉంటుందన్నారు. రూ.2.50 కోట్లతో చేపట్టిన ఆర్డీఎస్ఎస్ పనులు 80 శాతం పూర్తైనట్లు ఈఈ తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

● లీగల్ ప్రొటక్షన్ అధికారి ప్రశాంతి

క్రోసూరు,జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ న్యాయశాఖ అధికారి జే ప్రశాంతి అన్నారు. గురువారం మండలంలోని బయ్యవరం జడ్పీ హైస్కూల్లో కిషోరవికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే చైల్డ్ హెల్ప్ లైన్‌కి ఫోన్ చేయాలని సూచించారు. ఆడ పిల్లకు 18, మగ పిల్లవాడికి 21 సంవత్సరాలు నిండ కుండా వివాహం జరిపితే చట్ట రీత్యా నేరమన్నారు. బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించాలన్నారు. బాలబాలికల హక్కులు, చట్టాల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వణుకూరి మాధవి, పాఠశాల హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగు నీటి శాంపిల్స్ సేకరణ

వెల్దుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోయపల్లిలో గురువారం ఏఈ బాలునాయక్ బోరు నీటి శాంపిల్‌ని సేకరించారు. వారం రోజులుగా నీరు పచ్చగా వస్తుండడంతో గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏఈ మాట్లాడుతూ తాగునీటి శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపి రిపోర్ట్‌ను పరిశీలి తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు వివరించారు.



అందుకూరు యూపీ స్కూల్లో సాంప్రదాయ దుస్తుల్లో విధులకు హాజరైన ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

క్రోసూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందుకూరులోని యూపీ స్కూల్లో ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తుల్లో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాలపోటీలు నిర్వహించారు. అనంతవరం యూపీ స్కూల్లో విద్యార్థులు హరిదాసుల వేషంవేశారు. దొడ్లేరు హైస్కూ ల్లో భోగి మంటలు ఏర్పాటు చేశారు. హసానాబాద్ హైస్కూల్లో విద్యార్థులకు బొమ్మలకొలువు ఏర్పాట్లుచేశారు. అలాగే ముగ్గుల పోటీలను నిర్వహించారు.

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఉపాధ్యాయినులు విద్యార్థుల తలపై భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్ఎం ఐవి నాగమణి, ఉపాధ్యాయులు పోలు రాజు, అప్పారావు, శ్రీనివాసరావు, పెదయూసఫ్, నారాయణ, మధుబాబు, రామ్మోహన్, ప్రసాద్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారిపై దాడికి ఖండన

పిడుగురాళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కరిముల్లా భాషపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామంలో వక్ఫ్‌బోర్డుకు భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో భూములు పరిశీలించేందుకు వెళ్లిన కరిముల్లా భాషపై ఆక్రమణదారులైన వైసీపీ నేతలు మాధవరావు, మరి కొందరు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి సంబంధిత వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తా

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ఆస్పత్రికి కావాల్సిన కొన్ని సౌకర్యాలపై ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన అదనపు భవనాలను త్వరలోనూ ఆరోగ్యశాఖ మంత్రితో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను సభ్యులతో కలిసి చర్చించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, ఏవో భవానీదేవి, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ అరుణకుమారి, ఎలినేడి లక్ష్మీతులసీ, మారెళ్ళస్వామి, శిరిగిరి మణికంఠ, జవ్వాజి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి


సత్తెనపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరుతూ గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి ప్రధాన మంత్రి బర్తరఫ్ చేయాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహం వద్ద పాదాలకు వినతి పత్రం ఉంచి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ సమన్వయ కర్త చుక్కా చంద్రపాల్, నేతలు దాసరి జ్ఞానరాజ్‌పాల్, మాదంశెట్టి వేదాద్రి, చినగురు, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మండాది బోడులో కార్చిచ్చు

● అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చిన వాహనదారులు

వెల్దుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న మండాది బోడులో కార్చిచ్చు రగులుకుంది. గురువారం మధ్యాహ్నం బోడులో మంటలు ఎగిసిపడుతుండడంతో రహదారిపై వెళ్తున్న వాహనదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేశారు. కాగా అప్పటికే బోడుపై కి.మీ. మేర మంటలు వ్యాపించాయి. మంటల నుంచి వచ్చిన పొగతో హైవేను కమ్మేయటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోడుపై దట్టంగా ఎండు గడ్డి వ్యాపించి ఉంది. ఆకతాయిలు నిప్పంటించటంతో మంటలు వ్యాపించి గడ్డి తగుబడి ఉంటుందని భావిస్తున్నారు.





బోడులో ఎగిసిపడుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజలకు సత్వర సేవలే లక్ష్యం

● ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి





సత్తెనపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సత్వర సేవలు అందించటమే లక్ష్యమని, సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తామని ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేలా, అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. గురువారం ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జ : 1525 దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న : ఎన్ని పరిష్కారం అయ్యాయి?

జ : 1017 పరిష్కార మయ్యాయి.

ప్రశ్న : ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.

జ : 497 పెండింగ్‌లో ఉన్నాయి. మరో 11 పరిష్కారంలో ఉన్నాయి.

ప్రశ్న : మ్యూటివేషన్ కోసం ఎన్ని దరఖాస్తులు వస్తాయి? ఎన్ని పరిష్కార మయ్యాయి?

జ : 361 దరఖాస్తులు వచ్చాయి. 235 పరిష్కారమయ్యాయి. 120 పెండింగ్‌లో ఉన్నాయి.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, మాజీ మంత్రి ఆలపాటి

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

క్రోసూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాదుతో చెక్కులను అందజేశారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు నియోజకవర్గంలోని 22 మంది లబ్ధిదారులకు రూ.22.71 లక్షలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యం అందక ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నిరు పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, వేగుంట రాణి, మొగల్‌జాన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పని అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ..

సత్తెనపల్లి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పని అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు అందించాలని ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బందికి డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో గురువారం 2024 ఆర్థిక ఏడాదిలో మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన రూ.13,22,34,583 విలువైన 1397 పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024 డిసెంబరు 26, 27, 28 తేదీల్లో ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలిచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ పీవీ నారాయణ, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఏఈలు ఆర్‌వీవీ సుబ్బారావు, సింగ్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రాజుపాలెం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం, కోట నెమలిపురి, కొత్తూరు, పెద్ద నెమలిపురి, గణపవరం, రెడ్డిగూడెం, దేవరంపాడు, మొక్కపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ పీ.విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో 39 మంది అధికారులు, 117 మంది 39 బృందాలుగా ఏర్పడి 2499 సర్వీసులు తనిఖీ చేసిన్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఆపరేటివ్ ఇంజనీర్ సింగయ్య తెలిపారు. తనిఖీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8మందికి రూ.9వేలు మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 9 మందికి రూ1.16లక్షలు, ఇతర కేటాగిరి లో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గరికి రూ.9వేలు, అదనపు లోడుతో విద్యుత్ వాడుతున్న 59 మందికి రూ1.61లక్షలు చొప్పున మొత్తం రూ.2.95లక్షలు అపరాధ రుసుం విధించిన్నట్లు వారు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను ఫోన్ నెంబరు 9440812263, 9440812360కు నేరుగా, వాట్సాప్ ద్వారా తెలియజేయాలని ప్రజలకు సూచించారు. తనిఖీలలో డీఈఈలు రవి కుమార్, నాగ సురేష్ బాబు, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, పెద్ద మస్తాన్ తదితరులు ఉన్నారు.

మాచర్ల తహసీల్దారుగా కిరణ్‌కుమార్

మాచర్లటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండల తహసీల్దారుగా నియమితులైన బండెల కిరణ్‌కుమార్ గురువారం తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. కిరణ్‌కుమార్ కలెక్టరు కార్యా లయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మాచర్లకు వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

గురజాల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం కంభంపాడు సమీపంలో ఆటోని బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. ఇద్దరి ప్రయాణికులతో ఆటో మాచర్లనుంచి కంభంపాడు వెళుతుం డగా, రెంటచింతల నుంచి మాచర్ల వస్తున్న బొలెరో వాహనం ఖమ్మంపాడు సమీపంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ బాలంగి నాగేశ్వరరావు అక్కకిక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ మణికృష్ణ ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.


ఇంటర్ బోర్డు కార్యాలయం

ఇంటర్.. ఇంటర్నల్‌గానే

● సీబీఎస్ఈకి అనుగుణంగా మార్పులు
● కళాశాల స్థాయిలోనే ప్రథమ సంవత్సర పరీక్షలు
● ద్వితీయ సంవత్సర పరీక్షలు బోర్డు నిర్వహించేలా సన్నాహాలు
● జాతీయ స్థాయి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక
● ఇంటర్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వ నూతన సంస్కరణలపై భిన్నాభిప్రాయాలు

గుంటూరు(విద్య), నరసరావుపేట టౌన్, బాపట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. పరీక్షలు.. మార్కులు.. ర్యాంకులు.. విద్యార్థులపై ఒత్తిడి. ఇదీ నేటి విద్యా విధానం. ప్రధానంగా ఇంటర్ మీడియట్‌లో పరీక్షలు, మార్కులు, ర్యాంకుల ఒత్తిడి విద్యార్థులపై తీవ్రస్థాయిలో ఉంది. ఈ ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహా దేశంలోని ఇతర రాష్ట్రాల బోర్డులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్ని నిర్వహించడం లేదు. ఈ క్రమంలో ఏపీలోని ఇంటర్ విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్పులకు సిద్ధమైంది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని పలువురు విద్యావేత్తలు భావిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలను ఇంటర్నల్‌గా నిర్వహించా లని ప్రభుత్వం సూచిస్తోంది. ఇందుకు అనుగుణంగా వచ్చే ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంటర్ విద్యాసంస్థల్ని సన్నద్ధం చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 30, అన్‌ఎయిడెడ్ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు 100పైగా ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 45 వేల మంది, ద్వితీయ సంవత్సరం 43 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు సమాచారం. ఇంటర్ మొదటి సంవత్సరంలో 2025- 26 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశ పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పాఠశాల స్థాయిలో ఇప్పటికే మార్పులు

పాఠశాల విద్యా శాఖ 2024-25 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను ప్రవేశపెట్టింది. తదనుగుణంగా 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో కూడా ఎన్‌సీఆర్‌టీ పాఠ్య పుస్తకాలను తీసుకురావాల్సి ఉంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ సిలబస్‌కు అనుగుణంగా ఈ మార్పులు జరగనున్నాయి. దేశ వ్యాప్తంగా అమల్లో ఉన్న మూల్యాంకనాన్ని పరిగణనలోకి తీసుకుని ఏపీలో కూడా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్ని బోర్డు నిర్ణయించిన సిలబస్, బ్లూ ప్రింట్ ఆధారంగా కళాశాలల్లో ఇంటర్నల్‌గా నిర్వహిస్తారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్ని మాత్రం ప్రస్తుత విధానంలో బోర్డు నిర్వహించి ఫలితాలను విడుదల చేస్తుంది.

అందరితో చర్చించాలి..



ఇంటర్‌లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశ పెట్టి పరీక్షా విధానం, సిలబస్‌లో మార్పులపై మేధావులు, విద్యావేత్తలు, సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. సిలబస్ సీబీఎస్ఈకి మారినా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం నిర్వహించాలి. పోటీ పరీక్షలకు అనుకూలంగా ప్రస్తుతం ఇంటర్‌లో గణితం సిలబస్ ఉంది. దీనిలో మార్పులపై ఒకసారి పునరాలోచించాలి.

- కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

ప్రస్తుత విధానమే బేష్..



ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని మార్చాల్సిన అవసరం లేదు. ఇంటర్నల్ మూల్యాంకనాన్ని వ్యతిరేకించలేం. లాభాల లక్ష్యంతో నడుస్తున్న విద్యాసంస్థలు ఇం టర్నల్స్‌లో విద్యార్థి ఏం రాసినా పూర్తి మార్కులు వేస్తున్నాయి. పబ్లిక్ పరీక్షలపై ఆధారపడి మార్కులు ఇవ్వడంలో విద్యార్థిపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. మన విధానం బాగున్నపుడు సీబీఎస్ఈని అనుసరించాల్సిన అవసరం లేదు. ఇంటర్ విద్య మాతృభాషలో ఉండాలి. విద్యార్థిపై ఒత్తిడి ర్యాంకుల పరుగులో వస్తోంది తప్ప సబ్జెక్టు భారం వల్ల కాదు. ఆరు సబ్జెక్టుల్లో ఐదు పాస్ అయినా చాలు అన్నది అర్థరహితం.

- డీ రమేష్‌పట్నాయక్, ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్

సంస్కరణలతో నూతన ఒరవడి



వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో తీసుకు రానున్న సంస్కరణలు నూతన ఒరవడిని సృష్టిస్తాయి. ఇప్పటి వరకు మూస పద్ధతిలో ఉన్న గణితం, సైన్స్, విజ్ఞాన, జీవశాస్త్రాలు కలిపి ఒకేతా టిమీదకు తీసుకు వచ్చి విద్యార్థి నైపుణ్యతను వెలికి తీసుకువచ్చే కార్యక్రమం జరగబో తున్నది. జాతీయ విద్యావిధానం, ఎన్‌సీఈఆర్‌టీ సిల బస్ విద్యార్థి అనేక రకాలైన అవకాశాలను అందిపుచ్చుకునే పరిస్థితి కల్పిస్తుంది. సైన్స్ విద్యార్థి కూడా సోషల్‌సైన్సెస్, కామర్స్, ఎక నామిక్స్, సివిక్స్, చరిత్ర, **వ్యాపారశాస్త్రం, చార్టటెండ్** అకౌంట్స్‌లో నిష్ణాతులయ్యే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ ఎం గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్, కేఆర్ జూనియర్ కళాశాల, నరసరావుపేట

ఆహ్వానించదగ్గ పరిణామం



ఐఐఎం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఇంటర్ విద్యలో చేస్తున్న సంస్కర ణలు ఆహ్వానించదగ్గ పరిణామం. ఇందులో విద్యార్థి రెండు రకాలైన గ్రూప్‌లు తీసుకునే అవకాశం ఉం టుంది కాబట్టి పోటీ ప్రపం చంలో విద్యార్థికి చాలా ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అధ్యా పకులుగా ఆలోచిస్తే గణితం అధ్యాపకులకు అవకాశలు దెబ్బతింటాయనే అనుమానం ఉంది. విద్యార్థుల పరంగా ఆలోచిస్తే ఇది చాలా ఆహ్వానించదగిన పరిణామం.

- డాక్టర్ ఎంఎస్ సుధీర్, ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ కళాశాల, నరసరావుపేట

విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది



ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనే బోర్డు పరీక్షలు పెట్టాలనే ప్రతిపాదనలు విద్యార్థులపై ఒత్తిడిని తగ్గి స్తుంది. కాకపోతే విద్యార్థు ల సిలబస్ విషయంలో అందుకు తగ్గట్లు మార్పు లు చేయాలి. లేకపోతే వారిపై పరీక్షలు లేకపోయి నా అదనపు భారం విషయంలో అదే ఒత్తిడి ఉంటుంది. కానీ దీనికి సంబంధించిన మార్గద ర్శకాలలో స్పష్టత ఉండాలి. లేదంటే ఈ అవకాశాన్ని కొన్ని కళాశాలలు దుర్వినియోగం చేసే అవకాశం కూడా లేకపోలేదు.

-షేక్. నజీర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

సీరియస్‌నెస్ ఉండదు



ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఇంటర్ పరీక్షల సంస్కరణలు పేద విద్యార్థులకు నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ప్రతిభ పరంగా కొంచెం వెనకబడి ఉండే విద్యార్థులకు మొదటి సంవత్సరం పరీక్ష లేదనేసరికి సీరియస్‌నెస్ లోపిస్తోంది. కార్పొరేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు దీనివల్ల నష్టం పెద్దగా ఉండకపోవచ్చు. తమిళనాడులో ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్ వచ్చినవాళ్లకే ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్టులకు అనుమతి అనేది వారి నిబంధన. కానీ ప్రభుత్వం ఈ విధానం తీసుకొస్తే అక్కడ అడ్మిషన్లను మన విద్యార్థులు కోల్పోతారు. సంస్కరణలు తేవాల్సిందే కానీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను విస్మరించకూడదు

-ఎం.వెంకటేశ్వర్లు(ఎం.వీ), శ్రీగౌతమి విద్యాసంస్థల ఎండీ, చీరాల


నృసింహాలయంలో ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

నేడు నృసింహుని ఉత్తర ద్వార దర్శనం

● దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థప్రసాదాలు
● అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

మంగళగిరి సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం జరుగనున్న ముక్కోటి ఉత్సవాలకు అధికారగణం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గురువారం రాత్రి స్వామి వారిని జగన్మోహినిగా అలంకరించడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం వేకువజామున మూడున్నర గంటల ప్రాంతం లో శ్రీ స్వామివారు, అమ్మవార్ల ఉత్సవరులను బంగారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి తీసుకువచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అయితే బంగారు దక్షిణావృత శంఖు తీర్థాన్ని మాత్రం ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ ముఖమండపంలోనే ఇస్తారు. ఇందుకోసం భక్తులు విధిగా ఆలయంలోనికి వెళ్లి మూల విరాట్‌ను దర్శించుకుని శంఖుతీర్థాన్ని స్వీకరించాల్సి ఉంటుంది. ఈ కారణంగా ఆలయంలోనికి వెళ్లేందుకు నాలుగు ప్రధాన క్యూలైన్లను ఏర్పాటుచేశారు. ఆలయానికి ఉత్తరంగా వున్న కల్యాణోత్సవ గ్రౌండు నుంచి ఉచిత క్యూలైన్‌తో పాటు దక్షిణం వైపు నుంచి తూర్పు రాజగోపురం గుండా రూ. వంద, రూ.200 టిక్కెట్లు, ప్రోటోకాల్ దర్శనం కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు నిర్మించారు. ఉత్తర ద్వారం వద్ద సాధారణ ఉచిత క్యూలైన్‌తో పాటు రూ.వంద, శీఘ్రదర్శనం(రూ.200) క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బంగారు దక్షిణావృత శంఖుతీర్థాన్ని శుక్రవారం వేకువజాము మూడున్నర గంటల నుంచి రాత్రి ఆలయ ద్వార బంధనం చేసే వేళ వరకు అంటే రాత్రి పది గంటల వరకు ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణా ధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలియజేశారు. శంఖుతీర్థం కోసం దూరప్రాంతాల నుంచి కూడ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున భక్తుల సౌకర్యార్థం శంఖుతీర్థ ప్రసాద సమయాన్ని పెంచడంతోపాటు మర్నాడు శనివారం కూడా శంఖుతీర్థ ప్రసాదాలను అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ఉ త్సవాల సందర్భంగా ఉత్తర గాలిగోపురంతోపాటు ఎగువ, దిగువ సన్నిధులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ముక్కోటి ఉత్సవ ఏర్పాట్లు పూర్తి: ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

మంగళగిరిలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. దిగువ సన్నిధిలో గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ముక్కోటి ఉత్సవాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్షించి పలు సూచనలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ, ముక్కోటి ఉత్సవాల ఇన్‌చార్జి లీలాకుమార్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు పాల్గొన్నారు. నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీ కృష్ణ ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్య వేక్షించారు. అర్బ న్ సీఐ డి.వినోద్‌కుమార్ సిబ్బందికి విధులను కేటాయించారు

అమరావతిలో..

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాలలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివార్ల ఉత్తరద్వార దర్శనం శుక్రవారం ఉదయం ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా అమరావతి లోని అమరేశ్వరాలయం, వైకుంఠపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు కోదండరామాలయం, పాండురంగ స్వామి ఆలయం, గీతామందిరంలో ఉదయం 5గంటల నుంచి స్వామివార్ల ఉత్తరద్వార దర్శనం భక్తులకు కల్పించనున్నారు. ముందుగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు ఉత్సవమూర్తులను ఉత్తరద్వారంలో ప్రత్యేక మండపంపై ఏర్పా టు చేయనున్నారు. ఉదయం పది గంటలకు పురవీధు లలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించ నున్నారు.


ప్రత్యేక అలంకరణలో నృసింహుడు


పోలీసు సిబ్బందికి విధులు కేటాయిస్తున్న సీఐ వినోద్‌కుమార్


శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు

నకిలీ పాస్ పుస్తకాలతో రూ.5కోట్లు స్వాహా

(3వ పేజీ తరువాయి)

పాటిమీదిబజారుకు చెందిన సుంకర వెంకటేశ్వర్లు, తురుమెళ్ళ వెంకటసందీప్‌కుమార్ అలియాస్ సందీప్, హనుమాన్‌నగర్ ఐదో లైనుకు చెందిన బత్తుల లక్ష్మీనారాయణ, నడిగడ్డ గ్రామానికి చెందిన నెమలిపురి శ్రీనివాసరావు, నూజెండ్ల మండలం మొలకలూరు గ్రామానికి చెందిన మానం నాగేశ్వరరావు, గుంటూరు ఆర్టీసీకాలనీ ఒకటో లైన్‌కి చెందిన ఆవుల తిరుపతిరెడ్డి అలియాస్ నానిరెడ్డి, ప్రస్తుతం నరసరావుపేటలో ఉంటున్న నాటి మాచవరం విశ్రాంత తహసీల్దారు గడినపూడి లెవిలను అరెస్టు చేశారు. నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి ఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు తెలిపారు. నకిలీ పాస్ పుస్తకాలతో సొసైటీల్లో రుణాలు తీసుకునేందుకు ఈ ముఠా ప్రణాళిక రూపొందించి అమలు చేసింది. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటిస్తే ఆయా రుణాలు చెల్లించే పని ఉండదని, బ్యాంకులు కూడా పట్టించుకోవని ఈ ముఠా రెండు రకాలైన నేరాలకు పాల్పడిందని ఎస్పీ తెలిపారు. నమోదైన కేసులో సుమారు 30 మంది నిందితులు కలిసి నకిలీ రైతులను ఎంపిక చేసుకుని బ్యాంకులో వారి పేరు మీద రుణాలు తీసుకున్నారని తేలిందని, అయితే వీరిలో 11 మంది నిందితులను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా..

ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పశ్చిమ వీరాయపాలెం గ్రామానికి చెందిన ఉన్నగిరి లింగేశ్వరరావు పేరు మీద చిన్నకోండ్రుపాడు సొసైటీలో రూ.6 లక్షల రుణానికి సంబంధించి గత ఏడాది సెప్టెంబరు 18న ప్రతిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2022 ఫిబ్రవరి 23, 24 తేదీల్లో 'ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్లో జీడీసీసీలో నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు పెట్టి రూ.5 కోట్ల స్వాహా' అనే శీర్షికన వరుసగా వార్తా కథనాలు వెలువడగా వాటిని ఆధారంగా చేసుకుని సీఐ శ్రీనివాసరావు ఈ కేసును దర్యాప్తు చేశారు. నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు, 1బీ, అడంగల్, ఆధార్, పాన్ కార్డులతో వెబ్ లాండ్ ఎక్కించి రుణాలు తీసుకున్న తర్వాత ఆ వివరాలను వెబ్‌సైట్ నుంచి తొలగించేవారని తమ విచారణలో తేలినట్లు ఎస్పీ తెలిపారు. సీతారామాంజనేయులునకిలీ పాస్ పుస్తకాలను తయారు చేస్తుండగా, ఆవుల తిరుపతిరెడ్డి ఆధార్ కార్డులో అడ్రస్‌లను మార్చి పాన్ కార్డులను తయారు చేసేవాడన్నారు. నకిలీ రైతులను తిరువీధుల. యోగయ్య, తురుమెల్ల వెంకటసందీప్‌లు సమకూర్చగా వీరికి బొల్లినేడి. రవికుమార్, అప్పటి జీడీసీసీ ప్రత్తిపాడు బ్రాంచ్ మేనేజర్, అప్పటి మాచవరం తహసీల్దారు లేవీ సహకరించేవారన్నారు. కర్రి రవిచంద్రబాబు, ఉన్నగిరి లింగేశ్వరరావు, పండిత నాగరాజు, బత్తిపళంకి వీరయ్య, సరిపల్లి అప్పరాజు, నారు వెంకటరెడ్డిలను నకిలీ రైతులుగా చూపించి రుణాలు తీసుకున్నారు. 54 రుణాల మంజూరు సంబంధించి సుమారు రూ.5 కోట్ల కుంభకోణం జరిగినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు అనంతరం మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేస్తామన్నారు. 11 మందిని అరెస్టు చేసిన సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, ప్రతిపాడు సీఐ శ్రీనివాసరావు, పెదనందిపాడు, కాకుమాను ఎస్ఐలు మధుపవన్, ఏకనాథ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో సౌత్ డిఎస్పీ మల్లికార్జునరావు, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు

రుణాల.. మాఫీయా

(3వ పేజీ తరువాయి)

వీరంతా కలిసి బ్యాంకు సొమ్మును పక్కదారి పట్టించారని విచారణలో వెలుగుచూసింది. నకిలీ సభ్యుల పేర్లపై ఆస్తుల బది లీ ప్రక్రియకు వీరు సహకరించినట్లు అధికారుల విచారణలో వెలు గుచూసింది. పల్నాడు ప్రాంతంలో ఇలాంటివి ఎక్కువగా జరిగి నట్లు గుర్తించారు. రుణాలు పొందేందుకు నకిలీ ఈసీలు సృష్టించా రని పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ నివేదిక ఇచ్చారు. మార్టిగేజ్‌లో కూడా అక్రమాలు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ విచారణలో తేలింది. పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన కొందరు నేతలు జీడీసీసీని అడ్డగోలుగా కొల్లగొట్టినట్లు అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. నల్లపాడు బ్రాంచ్‌లో రూ.70 కోట్ల వరకు రుణాలు మంజూరు కాగా అందులో రూ.53 కోట్లు ఒకే ఒక్క కోల్డ్‌స్టోరేజ్‌కి ప్లెడ్జ్ రుణాలు కింద మంజూరు చేశారంటే ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. నల్లపాడు బ్రాంచ్ అక్రమాలపై విచారణ జరుగుతుండగా గతంలోనే సహకారశాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నల్లపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన వారిని కూడా త్వరలోనే అరెస్టుచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

2022లోనే వెలుగుచూసిన అక్రమాలు

జీడీసీసీలో జరిగిన అక్రమాలపై సహకార కమిషనర్‌కు 2022 అక్టోబరు 6న జిల్లా సహకార అధికారి వీరాచారి నివేదిక అందజేశారు. బినామీ పేర్లతో కొట్టేసిన సొమ్మును వాటాలు వేసుకుని పంచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తం సొమ్ములో అగ్రభాగం అప్పటి నేతల జేబుల్లోకి వెళ్లగా, మిగిలిన మొత్తంలో స్థాయిని బట్టి పంపకాలు జరిగిందని సమాచారం. ఈ క్రమంలో అప్పటి జేసీ విచారణ జరిపించాలని ప్రభుత్వానికి లేఖ రాస్తూ సీబీడీ విచారణ జరిపించాలని కూడా పేర్కొన్నారు. అయితే నాటి ప్రభుత్వ పెద్దలు ఆ లేఖను కూడా తుంగలో తొక్కేలా బ్యాంకు అధికారులు, సిబ్బంది పావులు కదిపారు. ఎన్ని అక్రమాలకు పాల్పడితే అంత పెద్ద పోస్టులో కూర్చోపెట్టి వారితో మరిన్ని తప్పుడు పనులు చేయించారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లో ప్రస్తుతం అత్యంత కీలకమైన స్థానంలో ఉన్న చాలామంది అధికారులు కేసుల్లో ఉన్నవారే కావటం గమనార్హం. పైగా అప్పట్లో అక్రమార్కులను వదిలి పెట్టి ఆ అక్రమాలను వెలుగులోకి తెచ్చిన అధికారులను అప్పట్లో కొందరు వైసీపీ ముఖ్య నేతలు ఇబ్బందులు పెట్టారు. ఆ తర్వాత కూడా నల్లపాడు, రెడ్డిపాలెం, పల్నాడు జిల్లాలోని పలు బ్రాంచిల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. గత ప్రభుత్వంలో సీనియర్ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర జీడీసీసీ అక్రమాలపై విచారణ జరిపించాలని పోరాటం కూడా చేశారు.

వసూలు కానీ మొండి బకాయిలు అన్నీ అవేనా?

జీడీసీసీ బ్యాంకుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు రూ.425 కోట్ల వరకు వసూలు కానీ మొండిబకాయిలు ఉన్నట్లు ఆడిట్ నివేదికలు చెబుతున్నాయి. ఇవన్నీ నేతల జేబుల్లోకి వెళ్లినవే అని సహకార శాఖ అభియోగం. అసలు రుణాలు పొందిన వ్యక్తులు ఎవరో కూడా అధికారులకి తెలియదు. ఇటువంటి వాటిపై లోతైన విచారణ జరిగితే భోక్తలు వెలుగులోకి రారు.

మాజీ మంత్రి అంబటి సోదరులపై అట్రాసిటీ కేసు

● నిందితులను అరెస్టు చేయకపోతే దీక్ష : పిల్లి బాబూరావు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సోదరుడు మురళీకృష్ణలతో పాటు భజరంగ్ జూట్‌మిల్ నిర్వాహకులు, టీడీపీ నేతలు కోవెలమూడి రవీంద్ర, గుంటుపల్లి శేషగిరిరావు తదితరులపై జైభీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి బాబూరావు ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బాబూరావు తెలిపిన వివరాలు.. భజరంగ జూట్ మిల్‌లో లాభాలు, ఆస్తులు, కార్మికుల కాలనీ స్థలంపై 2009లో డైరెక్టర్ దావ్‌గోపాల్ లునాని అంబటి రాంబాబుకి జరిగిన అక్రమ సేల్ డీడ్‌ను రద్దు చేయాలని 2022లో హైకోర్టులో కేసు వేశారు. అంబటి సోదరులకు సహకరిస్తూ కోర్టులో వేసిన కేసు వెనక్కి తీసుకోవాలని 2023లో కోవెలమూడి రవీంద్ర, టీఎన్‌టీయూసీ నేత గుంటుపల్లి శేషగిరిరావులు తనను బెదిరించారు. సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో ఉండగా అంబటి బ్రదర్స్ బెదిరించారు. అయితే అప్పట్లో వైసీపీ పాలకులకు భయపడి కేసు పెట్టలేదు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్పీకి ఫిర్యాదుచేయగా తిరస్కరించి కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకోమని చెప్పారు. దీంతో గత నవంబరు 15న హైకోర్టులో పిటిషన్ వేయగా వారిపై కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయినా 53 రోజుల వరకు నిందితులపై ఎఫ్ఐఆర్ చేయలేదు. ఇప్పటికైనా నిందితులను అరెస్టు చేసి కోర్టుకి హాజరు పరచకపోతే ఎస్పీ కార్యా లయం ఎదుట దీక్ష చేస్తానని పిల్లి బాబురావు ప్రకటనలో హెచ్చరించారు.

అవలీలగా.. అత్యున్నత ర్యాంకు

● సీఏ, సీఎంఏలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం
● అకుంఠిత దీక్షతో కల సాకారం చేసుకున్న రిషబ్ ఓస్వాల్

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): అమ్మో సీఏ, సీఎంఏనా.. ఆ కోర్సులు చాలా కష్టం.. ఉత్తీర్ణత సాధించలేం.. అని ఎందరో విద్యార్థులు వెనుకంజ వేస్తారు. అకౌంటెన్సీపై ఇష్టంతో కోర్సులో చేరినా ఆ తర్వాత వెనుకంజ వేస్తారు. అందరూ కష్టమని భావించే ఈ కోర్సుల్లో అవలీలగా జాతీయ స్థాయిలో అత్యున్నత ర్యాంకులతో రిషబ్ ఓస్వాల్ అకౌంట్స్ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. అకుంఠిత దీక్ష.. ఆత్మవిశ్వాసం.. పట్టుదల.. ప్రణాళికతో తన కలని రిషబ్ సాకారం చేసుకున్నాడు. కోర్సు పూర్తి చేయడం మాత్రమే కాక రెండు పదుల వయసులోనే జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి మాస్టర్‌మైండ్స్ విద్యార్థి రిషబ్‌ఓస్వాల్ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు.రాజస్థాన్‌కు చెందిన రిషబ్ తల్లిదండ్రులు సుమిత్రి, రాజేష్‌కుమార్‌ఓస్వాల్‌లు బతుకుదెరువు కోసం చిత్తూరు జిల్లా పలమనేరుకు వచ్చి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ స్థిరపడ్డారు. రిషబ్ 2018లో పలమనేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐసీఎస్ఈ సిలబస్‌తో పది పరీక్షలు రాసి 97.5 శాతం మార్కులతో పాసయ్యాడు. అనంతరం సీఏ కోర్సు కోసం గుంటూరులోని మాస్టర్‌మైండ్స్‌లో చేరాడు. తొలుత 2020లో 96.8 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేశాడు, అనంతరం 2021లో సీఏ ఇంటర్ పరీక్షలు రాసి జాతీయ స్థాయిలో ఎనిమిదో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తర్వాత ఓ సంస్థలో ఆర్టికల్‌షిప్ పూర్తి చేస్తూనే సీఏ ఫైనల్ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు.దీంతో ఇటీవల ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ(చార్టెర్డ్ అంకౌంటెంట్) ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించాడు. ఇదిలా ఉంటే రిషబ్ సీఎంఏ(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ) కోర్సుపై దృష్టి పెట్టి అందులో ఫౌండేషన్, ఇంటర్ స్థాయిలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు.

రోజుకు 15 గంటలు చదివా

సీఏ ఫైనల్ పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం సిద్ధమయ్యాను. తొలుత సిలబస్‌ను రోజుకు 8 గంటల్లో విభజించుకుని చదివాను. తర్వాత రోజుకు పది గంటలు, ఆ తర్వాత 15 గంటల పెంచి చదివి.. పరీక్షలకు సిద్ధమయ్యాను. తీవ్ర మానసిక ఒత్తిడికి గురి కాగా సోదరి యుక్తా సూచనతో యోగా, ధ్యానంతో పాటు ఇష్టమైన సంగీతం విన్నాను. తల్లిదండ్రులు ప్రోత్సాహం, మాస్టర్‌మైండ్స్ అధ్యాపకులు ఇచ్చిన ప్రణాళిక ర్యాంకు సాధనకు ఎంతో ఉపయోగపడింది.

- రిషబ్ ఓస్వాల్



రిషబ్‌ను సత్కరిస్తున్న మట్టుపల్లి మోహన్

సమావేశానికి గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు (విద్య) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఏడో తేదీన పరీక్షా భవన్‌లో జరిగిన భారత్ సౌత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశానికి గైర్హాజరైన ప్రధాన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డిఇవో సివి రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సిరిపురం. నల్లపాడ, ముట్లూరు, నూతక్కి, పెనుమాక, అంగలకుదురు, యర్రపాలెం ఎంపీయూపి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు గైర్ హాజరయ్యారని తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గ్రేడ్స్ నిర్వహణ ఆయా ఉపాధ్యాయులకు నిధులు వారి ఖాతాలో జమ అయ్యాయని వెల్లడించారు అయినప్పటికీ సమావేశానికి వారు హాజరుకాలేదని వివరించారు సమావేశానికి హాజరు కాకపోవడానికి గల కారణాలు తెలియజేస్తూ వివరణ ఇవ్వాలని షోకాజ్‌లు జారీ చేసినట్లు డీఈవో రేణుక తెలిపారు.

పల్నాడు వార్తలు

♦ నరసరావుపేట ♦ వినుకొండ ♦ చిలకలూరిపేట

కాలువల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నూజెండ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ చివరి భూములకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని త్రిపురాపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్ పి. కాంతారావుకు గురువారం సత్తెనపల్లిలో వినతి పత్రం అందజేశారు. పీబీసీ మెయిన్ కెనాల్‌పై షట్టర్లు లేకపోవటంతో త్రిపురాపురం మేజర్‌కు సాగు నీరు కేటాయింపు కంటే తక్కువగా వస్తుందన్నారు. శిథిలావస్థలో చేరిన పైపు కల్వర్టులను తొలగించి నూతనంగా కల్వర్టులను నిర్మించాలన్నారు. ఎన్ఎస్‌పీ అధికారులు, ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, ఐనవోలు డీసీ చైర్మన్ రావుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ప్రస్తుతం కార్యకలాపాలు సాగుతున్న పశువైద్యశాల, వ్యవసాయ శాఖ, తహసీల్దార్, డీఆర్‌డీఏ కార్యాలయాలు

ప్రభుత్వం మారగానే కార్యాలయాలూ మార్పు

- నరసరావుపేట నియోజకవర్గంలో రొంపిచర్ల తీరే వేరు
- చర్చనీయాంశమవుతున్న నాయకుల తీరు



వైసీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగిన తహసీల్దార్, పశు వైద్య శాఖ కార్యాలయాలు

రొంపిచర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజక వర్గంలో రొంపిచర్ల మండలానికి రాజకీయంగా అధిక ప్రాధాన్యం ఉంది. ఏ పార్టీ నేతలైనా రొంపిచర్ల మండలంపై తమ రాజకీయ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని భావిస్తారు. దీంతోపాటు మండల కేంద్రమైన రొంపిచర్లలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కూడా అంతే ఉంటుంది. ప్రభుత్వం మారగానే పలు కార్యాలయాలు మారుతూ ఉంటాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ కార్యాలయాన్ని పోలీసు క్వార్టర్స్‌లో నిర్వహించారు. పశు వైద్యశాలను తిరుపతమ్మ గుడి వద్ద ఉన్న కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మార్కెట్ యార్డులో, డీఆర్‌డీఏ కార్యాలయాన్ని ఎస్‌బీఐ సమీపంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారగానే స్థానిక నేతల ప్రోద్బలంతో తహసీల్దార్, వ్యవసాయ శాఖ, వెటర్నరీ, డీఆర్‌డీఏ కార్యాలయాన్ని మార్చారు. అధికారం మారగానే కార్యాలయాలు మార్చటంపై నాయకుల తీరు ప్రజల్లో చర్చనీయాంశమవుతోంది. ఒకరు ఏర్పాటుచేసిన కార్యాలయాల్లో ప్రభుత్వం మారగానే మేము ఎందుకు కార్యాలయాలు నడపాలి అనే ధోరణిలో స్థానిక నాయకులు ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తున్నారు. ఇలా కార్యాలయాలు మార్చటం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదే. ఈ విధంగా నాయకుల తీరుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

రొంపిచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఛత్రపతి శివాజీ వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్‌ను గ్రామంలో నాలుగో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వచ్చారు. ఈ నెల 12వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాదెండ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి, అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

రొంపిచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాసవి అమ్మవారి దేవస్థానం, సీతారామ స్వామి దేవస్థానం పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వినుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని నడిగడ్డ గ్రామంలోని బోడెపూడి హనుమయ్య అండ్ సుప్రబాత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు వినుకొండ విశ్వసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ యడవల్లి శ్రీనివాసశర్మ గురువారం ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో జఫ్రుల్లా మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి ఈ పుస్తకాలు దోహదం చేస్తాయన్నారు. గ్రామ సర్పంచి సంతోషమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హేమంత్‌కుమార్, లింగయ్య, నాగేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ నాగయ్య, బోడెపూడి వీరాంజనేయులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు అబిల్ కళాం థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహకురాలు చందోలు నాగవాణి చేతుల మీదుగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీచేశారు.

నాదెండ్లలో..

నాదెండ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం ఎం సుందరరావు పంపిణీ చేశారు. గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత ఆర్థిక సాయంతో ఉన్నత పాఠశాలతో పాటు సంక్రాంతిపాడు ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాల విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి, జానకిధరరావు, యూటీఎఫ్ నాయకులు నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపిక

నరసరావుపేట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలకు చెందిన విద్యార్థి కస్పుర్తి ప్రియతం జేఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నారాయణ గురువారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 21 వరకు యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలలో యూనివర్సిటీ తరపున పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. విద్యార్థిని అభినందించారు.

పాతిమా షేక్ జయంతి వేడుకలు

రొంపిచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల చెరువు కట్ట సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం, ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త పాతిమా షేక్ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు.ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైపాస్ జాతికి అంకితం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం: ప్రత్తిపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించి, నియోజకవర్గానికే మణిహారంగా నిలిచిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డును దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని స్థానిక శాసనసభ్యులు ప్రతిపాటి పుల్లారావు గురువారం విలేకరుల సమావేశంలో అన్నారు. దేశానికే తలమానికంగా చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం పూర్తిచేశారని వివరించారు. 2019లో ఏర్పడిన జగన్ ప్రభుత్వం, టీడీపీ సర్కార్‌కు, చంద్రబాబుకు పేరొస్తుందన్న దురాలోచనతో బైపాస్ పనుల్ని ఆపేసిందని అన్నారు. గత పాలకులు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థను బెదిరించడంతో పనులకు బ్రేక్ పడిందని అన్నారు. పాత రహదారిపై ట్రాఫిక్ పెరిగి ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయనీ, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే యుద్ధప్రాతిపదికన బైపాస్ పనులు పూర్తయ్యాయని వివరించారు. రహదారి విస్తరణకు భూసేకరణ వ్యయంలో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని తెలిపారు.

ప్రభాకరరావుకు ఘన నివాళి

చిలకలూరిపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విశ్రాంత తెలుగు అధ్యాపకులు, హేతువాది తోటకూర ప్రభాకరరావు మృతి తీరనిలోటు అని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. స్థానిక సీఆర్ కాలనీలోని ప్రభాకరరావు గృహం వద్దకు వచ్చి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పుల్లారావు నివాళులర్పించారు. గురువారం తెల్లవారుజామున హైదరాబాదులోని కిమ్స్‌లో ప్రభాకరరావు (74) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పట్టణంలోని పలు కళాశాలలకు చెందిన అధ్యాపకులు, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్బులు, ఒయాసిస్ సంస్థ సభ్యులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఘనంగా జాన్ డేవిడ్ వర్ధంతి

చిలకలూరిపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ జాన్ డేవిడ్ సేవలు వెలకట్టలేనివని డాక్టర్ జేసీఎస్ బర్నబాస్ ఫార్ కార్నర్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్.బర్నబాస్ గురువారం అన్నారు. ఏఎంజీ, ఫార్ కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ జాన్ డేవిడ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాధితోపాటు, పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏఎంజి సంస్థ ప్రాంగణంలో జరిగిన సభలో బర్నబాస్ మాట్లాడుతూ కులాలకు , మతాలకు అతీతంగా సేవలు చేసిన మహోన్నత వ్యక్తి జాన్ డేవిడ్ అన్నారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు సాంబయ్య, మోజస్, మురాలా జోసెఫ్, పాస్టర్లు ప్రసన్న, పీటర్ ప్రిన్సిపాల్ కృపాదానం, దీపక్, అబ్రహం సామ్యూల్, సుకన్య తదితరులు పాల్గొన్నారు. వేద స్కూలులో డైరెక్టర్ పెరిసీ స్వరూప ఆధ్వర్యంలో జాన్ డేవిడ్ వర్ధంతి నిర్వహించారు. కాగా వివిధ రాజకీయ పార్టీల నేతలు, పలువురు ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న జాన్ డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఓబన్న జయంతి అధికారికంగా నిర్వహించడం హర్షణీయం

నరసరావుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవితను మర్యాద పూర్వకంగా వెలగపూడి సచివాలయంలో కలిశారు. వడ్డెర ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి ఎస్ సవితకు ధన్యవాదాలు తెలిపారు. బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న పార్టీ టీడీపీ అని ఈ సందర్భంగా మంత్రి సవిత అన్నారు. కార్యక్రమంలో వడ్డేర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, వడ్డేర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి, పల్నాడు జిల్లా తెలుగు యువత కార్యదర్శి దేవళ్ళ దుర్గారావు, వేముల పాండు పాల్గొన్నారు

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

వినుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో వినుకొండ పట్టణంలోని చాణిక్య అకాడమీకి చెందిన 14 మంది విద్యార్థులు స్కేటింగ్‌లో పాల్గొనగా 12 మంది సత్తాచాటి మెడల్స్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ కంచర్ల నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక క్యాంపుల్లో విద్యార్థులు స్కేటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వీరభద్రాచారి, వసంతనాయక్, దేవిరాయుడు, ఉమామహేశ్వరరావు, మోహన్‌రాజు, కార్తీక్, కాశిరావు, టి.లక్ష్మి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్

నరసరావుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఎస్‌సీ అండ్ కేఆర్ విద్యాసంస్థలలో సైబర్ సెక్యూరిటీ మీద అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సైబర్ క్రైమ్, ఏప్స్, అడ్వర్‌టైజ్‌మెంట్స్, ఆధార్ కార్డు, పాన్‌కార్డులపై తెలియజేశారు. వాటిని ఎలా సైబర్ క్రైమ్ నుంచి రక్షించుకోవాలో ప్రదీప్ వివరించారు. సదస్సును కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాస ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసరులు మందడపు ప్రవీణ్, అనిల్ కుమార్, అరుణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆచూకీ కోసం గాలింపు

వినుకొండటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు కనిపించకుండ పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు హనుమాన్‌నగర్‌కు చెందిన జెట్టి ప్రసాద్ తోటి మిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లి కురిచేడు సమీపంలోని ఎన్ఎస్‌పీ కాల్వపై మద్యం తాగారు. ప్రసాద్‌తోపాటు ఉన్న స్నేహితుడు తిరిగి వినుకొండకు వచ్చినప్పటికీ ప్రసాద్ ఆచూకీ గత నాలుగు రోజులుగా తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురిచేడు ఎస్ఐ శివ గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థి బలవన్మరణం

నరసరావుపేట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండలో గల టీటీడీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో విద్యనభ్యసిస్తున్న సూరజ్ అనే విద్యార్థి బుధవారం రాత్రి బలవన్మరానికి పాల్పడినట్టు ఎస్సై కిషోర్ తెలిపారు. మృతుని తండ్రి శివశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా వేదపాఠశాల ప్రిన్సిపాల్ వేధింపుల కారణంగా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడని అర్చకులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటకు కారకులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తొక్కిసలాటలో సుమారుగా ఆరుగురు భక్తులు చనిపోవడం, 48 మందికి గాయాలు కావడం దారుణం అన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత పేరున్న దేవస్థానంలో ఈ సంఘటన జరగడం విచారకరమన్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరుపతి సంఘటన దురదృష్టకరం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో 6 గురు మృతి చెందడం, 40 మందికి పైగా గాయాలపాలవడం దురదృష్టకరమని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని ఆయన వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీ బహిరంగ సభ, రోడ్డు షో విజయవంతమవడం, రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చేలా ఆయన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి, ఆంధ్రప్రదేశ్ పేరుప్రఖ్యాతులు ప్రపంచస్థాయిలో మార్మోగేలా చేసిన సమయంలో, తిరుపతిలో దుర్ఘటన జరగడం యావత్ దేశానికే విచారకరమని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఈపూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలని, అందుకోసం స్టడీమెటీరియల్ ఎంతగానే ఉపయోగపడుతుందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్ అన్నారు. ఈపూరు హైస్కూల్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన చంద్రజిత్ యాదవ్ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవడం వలన మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ యతిరాజు, ఎస్టీయూ నాయకులు కొంగా వెంకటేశ్వర్లు, వి.అంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, కె.జాన్ మోసెస్, కె.మరియరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎం మోదీకి ఘన స్వాగతం పలికిన జీవీ



పీఎం మోదీకి స్వాగతం పలుకుతున్న జీవీ

వినుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనలో భాగంగా బుధవారం సిటీ ఆఫ్ డెస్టినిటికి వచ్చిన భారత ప్రధాని నరేంద్రమోదీని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కలుసుకుని ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘనస్వాగతం పలికారు. తనకు ఈ అరుదైన అవకాశం రావడంపై జీవితోపాటు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జామాయిల్ చెట్లు ఎగుమతికి సిద్ధం



అడవిలో ఎగుమతికి సిద్ధం చేస్తున్న జామాయిల్ కర్ర

వినుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్టు పరిధిలో పనిచేస్తున్న వనసంరక్షణ సమితి సభ్యుల నివాస గ్రామాలకు మంచిరోజులు రానున్నాయి. ఇటీవల వినుకొండ ఫారెస్టు రేంజ్ పరిధిలో 138 ప్లాంటేషన్‌లోని 1239 హెక్టారులో సుమారు 3300 టన్నుల జామాయిల్ కర్ర అమ్మకానికి ఫారెస్టు అధికారులు టెండర్లు పిలిచారు. గత నవంబరులో జరిగిన టెండర్లతో టన్ను ఒకటికి రూ.9790 వెచ్చించి నెల్లూరుకు చెందిన వనం టింబర్ లైన్ యజమాని ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్నారు. ఫారెస్టు అధికారుల సంరక్షణలో అడవిలో ఏపుగా పెరిగిన లావైన జామాయిల్‌ను టెండర్ ద్వారా మద్రాసు తరలించేందుకు టెండర్‌దారులు సిద్ధమయ్యారు. ఈ నెల 7వ తేదీ నుంచి బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు సమీపంలో జామాయిల్ చెట్లను నరికి ఎగుమతి చేస్తున్నారు. నియోజకవర్గంలోని అత్యధికంగా రవ్వవరం, నాయుడుపాలెం సెక్షన్‌లో జామాయిల్ చెట్లు అధికంగా ఉండడంతో త్వరలో వీటిని కొట్టివేయనున్నారు. అమ్మకం ద్వారా వచ్చిన ఫారెస్టు ఆదాయంలో 50శాతం మేరకు వన సంరక్షణ సమితి సభ్యులు నివాసం ఉండే గ్రామాల్లో అధికారులు నిధులు వినియోగించనున్నట్లు వినుకొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి మాధవరావు తెలిపారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రాజుపాలెం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం, కొటనెమలిపురి, కొత్తూరు, పెద్ద నెమలిపురి, గణపవరం, రెడ్డిగూడెం, దేవరంపాడు, మొక్కపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ పీ.విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో 39 మంది అధికారులు, 117 మంది 39 బృందాలుగా ఏర్పడి 2499 సర్వీసులు తనిఖీ చేసిన్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఆపరేటివ్ ఇంజనీర్ సింగయ్య తెలిపారు. తనిఖీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8మందికి రూ.9వేలు మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 9 మందికి రూ1.16లక్షలు, ఇతర కేటాగిరి లో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గరికి రూ.9వేలు, అదనపు లోడుతో విద్యుత్ వాడుతున్న 59 మందికి రూ1.61లక్షలు చొప్పున మొత్తం రూ.2.95లక్షలు అపరాధ రుసుం విధించిన్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



హరిదాసుల వేషధారణలో విద్యార్థులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

వినుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారంపూడిరోడ్డులోని గీతాంజలి పాఠశాల ఆవరణలో విద్యార్థులు అంగరంగ వైభవంగా ఆటపాటలతో పాటు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొని సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దాదాపు 3 వేల మంది చిన్నారుల మధ్య పండగ జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన కోడి పందేల నిర్వహణ, హరిదాసుల వేషధారణ ఆకట్టుకున్నాయి. ముగ్గులు చుట్టూ చేసిన నృత్యాలు, దేవతామూర్తుల వేషధారణలు అలరించాయి. పల్లె సౌందర్యం తలపించే విధంగా ఎడ్లబళ్లపై విద్యార్థుల ఊరేగింపు ఉత్సవాలకే వన్నె తెచ్చింది. పిల్లలతో భోగి మంటలు, బోగిపండ్లు ప్రాధాన్యత, బొమ్మల కొలువలు, గంగిరెద్దులు, పగటి వేషాలు, బతుకమ్మ ఆటలు, తోలుబొమ్మ ఆట, గాలిపటాలు, పిండి వంటలు, చెరుకు గడలు వంటి వాటితో పిల్లలకు ఉపాధ్యాయులు వివరించే విధంగా కార్యక్రమాలు కనువిందు చేశాయి. చిన్నారులు వేసిన సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ వైఎల్ కిషోర్, విద్యాసంస్థల డైరెక్టర్ శేషగిరిరావులతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని లయోలా ఇంగ్లిష మీడియం పాఠశాల్లో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఫాదర్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ బాలసౌరయ్య, ఫాదర్ జోసఫ్, రాజాఫాదర్, ఆంతోని, వీరా, రాజేశ్వరి, మేరీ, లక్ష్మి, శైలజ, గురవయ్య మస్టారు, ప్రకాష్ పాల్గొన్నారు.

నూజెండ్లలో..



పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో...

నూజెండ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం ఉపాధ్యాయులు విద్యార్థులచే సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పెద్దవరం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఘంటా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.